స్కెచ్

# గాలివాన వెలిశాక—

వడ్లపట్ల దయానందం

“చెబితే వినిపించుకున్నారుగాదు. బంగారం లాంటి మూడెకరాల పొలాన్నీ మంటగలిపి పదివేలూ నాశనంచేశారు. మళ్ళా మన జీవితంలో సంపాయించగలమటండీ అటువంటి మడిచెక్కలు. అమ్మాయిపెళ్ళో అంటూ రెండుసంవత్సరాలనుండి నెత్తీనోరు కొట్టుకుంటున్నా. సనేమిరా వినిపించుకున్నారు కాదు. ఈ పదివేలూపట్టుకుంటే ఎంత ఘనంగా జరిగిపోయేదండి... ఇంతకీ... ఇదంతా దాని దురదృష్టం. దాని నొష్టన కళ్యాణం ఎప్పటికి రాసిపెట్టుందో? ఇంతకీ పెద్దది అదృష్టవంతురాలులెండి. ఏదో వాళ్ళ అమ్మమ్మ బ్రతికుండబట్టి మీరు బుద్ధదేవుడిలా ఇంట్లోనే కూర్చునున్నా... శుభకార్యం ఘనంగా నెరవేరింది. ధరావత్తు కట్టిన ఆ రెండొందల యాభైరూపాయిలు తిరిగివచ్చినా ఆ పెద్దవెధవ సైకిలుకు పనికివచ్చేవి. వాడు కాలేజీలో చేరినప్పటినుండి ఒకటే గొడవయ్యె. రోజూ రెండుసార్లు మైలుదూరం నడచేరావాలయ్యె. ఏమండీ, నాకు తెలీకడుగుతా.. పొరిగింటి పుల్లమ్మగారు ఆ ధరావతు రూపాయిలుకూడా రావంటుంది నిజమేనటండీ?”

సాధింపు ధోరణిని ప్రశ్నార్థకంలోకి మార్చి అడిగింది మునిమాణిక్యం.

ఏదో రాజకీయపార్టీ సపోర్టుతో ధరావత్తు కాస్తా కోల్పోయిన మంగయ్యకు చిర్రెత్తి ఆమట్ను భార్య మునిమాణిక్యాన్ని నాలుగు కూతలేసి లోనికి పొమ్మన్నాడు.

ఆయనకూ తగని మనేదగానే ఉంది. మొదట్లో స్వతహాగా ఆయనకు కలుగలేదీ ఉద్దేశ్యం. శరభయ్య, శీనాయి... ఇత్యాదులు, తప్పకుండా నెగ్గుతావని, కొన్ని ఆధారాలను కళ్ళకుకట్టినట్లు చూపబట్టే... అవును, నెగ్గే అవకాశం ఉంది అనుకుని నామినేషన్ పడేశాడు.

మూడునాలుగు వేలకంటే ఎక్కువ ఎట్టి పరిస్థితులలోనూ ఖర్చుకాదని, నామినేషన్‌కు ముందు వాదించిన శరభయ్యే అనంతరం పన్నెండువేలకి బడ్జెట్ తయారించి తీసుకువచ్చాడు. అన్నింటికంటే మంచి నీరులా చెల్లిపోయిన పెట్రోలుకే రెండువేల రూపాయిలు తగులపెట్టవలసి వచ్చింది. అద్దెకార్లు రెంటికి పదిహేనువందలు పోయవలసి వచ్చింది. పోనీ ప్రచారానికేమైనా ఉపయోగపడినవా ఈ కార్లనుకుంటే అదీలేదు. శరభయ్య, సీనయ్య ఇత్యాదులు, ఇండ్లకు భోజనాలకు పోవడానికి,తదితర స్వకార్యకలాపాలు చక్కదిద్దుకోడానికే ఉపయోగపడినయ్-అదేమిటోగాని మామూలు రోజుల్లో రెండు మూడు మైళ్ళన్నా రిక్షాకిసైతం దుడ్డుదండుగని, లక్షణంగా కాళ్ళకు బుద్ధిచెప్పేపై పెద్దలకు ఈ ఎన్నికల టైంలో ఒక ఫర్లాంగు పోవాలన్నా కారు కావలసివచ్చేది. ఇక ఆ రాజకీయపార్టీవారు మింగిందిఅంతా ఇంతాకాదు. తలచుకుంటే గుండే పగులుతోంది.

పోనీ అయిందేదో ఐపోయింది. కనీసం ధరావత్తైనా దక్కిఉంటే కాస్త గౌరవం నిలచేది. అదికూడా గల్లంతు కావడంవల్ల ఉన్న గౌరవం కాస్తా ఊడి చక్కాపోయింది. ప్చ్... అంటూ పడక కుర్చీలో నడుంవాల్చి, ఆలోచిస్తున్న మంగయ్యకి అల్లంత దూరాన, సందుమలుపు తిరిగి పోతున్న భీమయ్య కన్పించాడు. వాణ్ణిపిలచి అమాంతం పీకెనులిపి పారేద్దామా అన్నంతకోపం వచ్చింది మంగయ్యకి.

వెధవ ... వందరూపాయలు పుచ్చుకున్నాడు వాడిచేతిలో మూడువందల ఓట్లున్నవని! తీరా చూస్తే ఆ బూతులో తన పెట్టెలోపడ్డవి మూడు ఓట్లేనాయె! వెధవని దండించి ప్రయోజనం ఏమిటి? తిరిగి తనే అల్లరిపడ్డం తప్పితే.

విధిలేక కోపాన్ని దిగమ్రింగుకొని సిగరెట్టు ముట్టించాడు మంగయ్య.

“ఏది బావా సిగరెట్టొకటి” అంటూ వచ్చాడు శరభయ్య. ఎన్నికలముందు అలా చెయ్యిజాపినప్పు

డబ్బూ లెక్కలేకుండా పారేసినా ఏమిటో ఇప్పుడొక సిగరెట్ ఇవ్వాలంటేనే చాలా బాధగా తోచింది. అయినా గత్యంతరంలేక ఇస్తూ "అలా కూర్చో శరభయ్యా" అన్నాడు నీరసంగా కుర్చీ చూపిస్తూ.

శరభయ్య సిగరెట్టుముట్టించి పాత అలవాటు చొప్పున చుట్టలా పీల్చేస్తూ మంగయ్య కళ్ళు తుడవడాని కుపక్రమించాడు. "చూశావ్ బావా అసలు వాతావరణమే మారిపోయిందిగాని లేక పోతే, మన లెక్క తప్పేదంటావా? ప్రజా స్వామ్యమూ! నియంతృత్వమా అంటూ క్రొత్త వాదం లేవదీసి ఇక్కడేకాదు, అన్నిచోట్లా, మనబోటి మధ్యరకం అభ్యర్థుల్ని నలిపి పారేశారు లేకుంటే ఇలా చస్తే జరిగేదా? ఈ ప్రజాస్వామిక వాదుల రంగు మనకు తెలియంది కాదు వచ్చేసారి ఎక్కడికి పోతారులే బావా ..." అన్నాడు శరభయ్య సిగరెట్టు బొద్దు రాలుస్తూ.

శరభయ్య చెప్పిన ప్రతి అక్షరంలోనూ, సత్యం గోచరించింది మంగయ్యకి. దానికి కారణం ఎన్నికలకు ముందు ఎవర్నడిగినా వోటు తనకే వేస్తామన్నవారే! అలా తనకు వేస్తామన్న వారిలో ఏ ఒక్కడూ తనకు వేయకపోవడంవల్లే తనోడిపోయింది. ఆవిధంగా తనకు వేస్తామన్న వారంతా వేయకపోవడానికి గలకారణం శరభయ్యన్నట్లు, ఎన్నికల వాతావరణం మారిపోవడంవల్లనే ననుకుంటూ. లేకపోతే అన్నీ తనకుపడి, నిఖరంగా నెగ్గేవాడే! ఆలోచిస్తున్నాడు.

ఇంతలో యముడిలావచ్చిపడ్డాడు పెయింటరు.

ఆలోచనలన్నీ ఫలాయనం చిత్తగించినయ్.

చిఱుచెమట పట్టుకొచ్చింది మంగయ్యకి.

ఎం.ఎల్.ఏ. క్యాండిడేటుగా నిలబడ్డాడన్న గౌరవమన్నా ఉంచకుండా, పదిరోజుల్నుంచీ వచ్చి నానామాటలూ అని పోతున్నాడు. అంతా కలిపితే వాడికివ్వవలసింది బోడి నూటయాభై.

శరభయ్యలేచి "వస్తాబావా" అంటూ తిరుగు సమాధానానికి వేచిఉండక నిష్క్రమించేశాడు.

మంగయ్య అతిదీనంగాచూస్తూ "రేపుసాయంకాలం కన్పించవోయ్ అంతా ఇచ్చేస్తాను" అన్నాడు.

"బాబుం ఇకనేను తిరగలేను ఊరికినే చేశాననుకుంటాను ఆ రంగుల కయిన ఖర్చయినా పడేయండి. ఇటువంటి భా...డ...కో...వ్"

"అబ్బబ్బ ఆమాట లెందుకోయ్ రేపిచ్చేస్తానంటున్నా గా! ఇన్నిరోజులాగినవాడివి ఒక్కరోజాగలేవా. నీకష్టం నేనుంచుకుంటానా ఆమాత్రం నాకు తెలియదూ" అన్నాడు మంగయ్య. ప్రాధేయ పూర్వకంగా.

"సరే ఇన్నిరోజులాగినాడిని ఈ ఒక్కరోజూ చూస్తా" నంటూ వెళ్ళిపోయాడు పెయింటర్.

"అమ్మయ్య" అనుకుని లేచి లోనికిపోయాడు మంగయ్యగారు.

ఇంతలోనే మళ్ళీ బయటపిలుపు "మంగయ్య గారూ" అంటూ. అమ్మాయితో "ఎవరో చూచిరా" అన్నాడు.

"పెట్రోలుబంకువాడట నాన్నా" అంది కూతురు సావిట్లోకిపోయి చూచివచ్చి.

"ఛీ-ఛీ వీడొకడు శనిలా దాపురించాడ"ని విసుక్కుని "ఇంట్లోలేరనిచెప్పవే"అంటూ ఆజ్ఞాపించాడు కూతుర్ని. చెప్పి తిరిగివచ్చి అంది- "ఏదో తిట్టుకుంటూ పోతున్నాడు నాన్నా" అని.

లేడని చెప్పమనటం - తిరిగివచ్చి ఏదో తిట్టుకుంటూ పోతున్నాడు నాన్నా అని కూతురు చెప్పటం- విన్న మునిమాణిక్యం——

"ఎందుకొచ్చిన ఖర్మండీ ఇదంతా"అంది.

కిక్కురు మనకుండా గ్లాసుడు ఉదకం పుచ్చుకుని "సరేలే - మీ అన్నదగ్గర కెప్పుడు వెడతావ్? ఇవ్వాళే మంచిది. నాలుగుగంటలబండికి పోయిరా. చూస్తూనే ఉన్నావ్‌గా, అధమపక్షం రెండు వేలయినా కావాలను. వచ్చేపంటల్లో సర్దేద్దాం. ఇవన్నీ అక్కడనబోకు. నువ్వుమళ్ళా రేపు మధ్యానానికల్లా సానుకూలం చేసుకురావాలి. నోటు తరువాత వ్రాసి పంపుదాంలే ఏం?" అన్నాడు మంగయ్య లాలనగా.

కాలేజీనుంచి ఒంటిగంటకు ఎండలోపడి నడిచి వచ్చిన కొడుకు "అబ్బ-ఉష్" అంటూ ఆపసోపాలు పడుతూ "ఇక సైకిల్ కొనకపోతే కాలేజీకి పోలేను" అంటూ ఖండితంగా చెప్పేశాడు.

"అలాగేలేరా, రెండు మూడు రోజుల్లో కొంటాను" అన్న తండ్రిమాటలు విని ఆశ్చర్యపోయాడు-సంవత్సరంనుంచీలేనిది ఈవేళ ఒక్కసారే ఇలా అన్నాడేమా అని. ★